క్లుప్తంగా

రైతుల శ్రేయస్సే సొసైటీ లక్ష్యం

పాల్వంచ: రైతుల శ్రేయస్సే పాల్వంచ సొసైటీ పాలకవర్గం లక్ష్యం అని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. కొత్వాల మాట్లాడుతూ... రైతులకు రుణాలు పంపిణీ, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు దళారుల బారిన పడకుండా పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరలకు కొనుగోలు చేస్తుందన్నారు. సొసైటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కాంపెల్లి కనకేష్, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, సామా జనార్దన్ రెడ్డి, మైనేని వెంకటేశ్వరరావు, భూక్యా కిషన్, బర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్లను ఆపొద్దు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): వ్యక్తిగత రుణాల రికవరీలో ఆసరా పెన్షన్లను జమ చేయవద్దని సీపీఐ నాయకులు బుధవారం ఏపీజీవీబీ మేనేజర్ హేమంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో ఆసరా పెన్షన్లు అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వైద్యఖర్చులు, పేదలకు జీవనోపాధికి ప్రభుత్వం ఆసరా పెన్షన్లను ఇస్తోందని తెలిపారు. స్పందించిన మేనేజరు పెన్షన్లను అందజేస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, సత్రం, లచ్చిరాం, గోబ్రియా, జోజియా, చిలకమ్మ, లక్ష్మి, వంశీ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

గ్యాస్ బంక్ ఎదుట ఆటో డ్రైవర్ల ధర్నా

పాల్వంచ: పాత పాల్వంచ సీఎన్‌జీ బంక్‌లో గ్యాస్ లేకపోవడంతో ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం బంక్ ఎదుట ఆటోలతో ధర్నా నిర్వహించారు. బాధితులు మాట్లాడుతూ.. బంక్‌లో ఎప్పుడూ గ్యాస్ ఉండటం లేదని, దీనివల్ల ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో బీసీఎం రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆటో డ్రైవర్లను సముదాయించి ధర్నా విరమింపజేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

పాల్వంచరూరల్: డీఎస్సీ–2024లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు మంగళవారం కౌన్సెలింగ్ పూర్తి చేసుకుని బుధవారం వారికి కేటాయించిన ప్రభుత్వ పాఠశాలల్లో విధుల్లో చేరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 13మంది కొత్త టీచర్లను కేటాయించినట్లు ఎంఈఓ శ్రీరామ్మూర్తి తెలిపారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను అందజేయగా విధుల్లో చేరినట్లు వివరించారు. మండలంలో మొత్తం 30 టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 13మంది కొత్తవాళ్లు రావడంతో ఇంకా 17 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

పాల్వంచ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని అమలు చేయాలని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఇంకా తాత్సారం చేస్తున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. బుధవారం బస్టాండ్ సెంటర్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి విస్మరించారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంకెన వెంకటేశ్వర్లు, సోమ వినోద, శ్రీను, నరసింహారావు, భాస్కర్, కృష్ణ, మల్లేష్, గోపి, సంపత్‌కుమార్, వీరన్న, చిరంజీవి, లక్ష్మి, రమేష్, రంజాన్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

జరిమానాలు రద్దు చేయండి..

ఇల్లెందు: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు డ్యూటీకి హాజరు కాని రోజుకు పెనాల్టీలు విధించే పద్ధతికి స్వస్తి పలకాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ కోరారు. బుధవారం ఇల్లెందులోని మున్సిపల్, సింగరేణి, గ్రామపంచాయతీ, వాటర్ వర్క్స్ అడ్డాలో కార్మికులతో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఏదైనా సమస్యతో కార్మికులు విధులకు గైర్హాజరు అయితే పెనాల్టీలు విధిస్తున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. అయినా ఏ సంస్థలో కూడా సక్రమంగా అమలు జరగడం లేదన్నారు. కనీస వేతన జీఓను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రఘు, పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, వీరన్న, గురునాథం, గోపీ, ఫయాజ్, రాజేష్, దుర్గ, మహేష్ పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్ యార్డు కలేనా?



ప్రైవేట్ స్థలంలో పత్తి కొనుగోళ్లు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

- ఏటా రూ.2 కోట్ల ఆదాయం
- ప్రభుత్వం 10 ఎకరాల స్థలం కేటాయించినా.. ప్రైవేట్ స్థలంలోనే పత్తి కొనుగోళ్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

జూలూరుపాడు: ఆరుగాలం శ్రమించే వారు రైతులు కాగా, రైతులు పండించిన పంట మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న హమాలీలకు జూలూరుపాడు పత్తి సబ్ మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా తాత్కాలిక పత్తి మార్కెట్ యార్డును జూలూరుపాడులో ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేస్తున్నారు. ఏటా ఈ మార్కెట్ యార్డుకు సెస్ రూపంలో రూ.2 కోట్లకు పైగా ఆదాయం వస్తున్నప్పటికీ ప్రైవేట్ స్థలంలోనే పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ మార్కెట్‌లో రోజుకు సుమారు రూ.2.50 కోట్ల వ్యాపారం జరుగుతుండగా, మార్కెట్ కమిటీకి రూ.2.50 లక్షల ఆదాయం వస్తోంది. ఆరేళ్ల క్రితం స్థానిక రెవెన్యూ అధికారులు మార్కెట్ యార్డుకు 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి మార్కెటింగ్‌శాఖకు అప్పగించారు. దీనిని శాశ్వత మార్కెట్ నిర్మాణానికి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. మార్కెట్ నిర్మాణ పనులకు నిధుల కేటాయింపు అంశాలు ఇంకా ప్రభుత్వ పరిశీలనలోనే ఉన్నాయి. దీంతో ఈ ఏడాది కూడా ప్రైవేట్ స్థలంలోనే పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు వ్యవసాయ మార్కెట్ అధికారులు నిర్ణయించారు. శాశ్వత మార్కెట్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా మట్టి తోలకాలు చేపడుతున్నా సంబంధితశాఖ అధికారులు కిక్కురమనడం లేదు. రాష్ట్ర మంత్రివర్గంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు కీలక పదవుల్లో కొనసాగుతున్నప్పటికీ శాశ్వత మార్కెట్ నిర్మాణ చేపట్టకపోవడంతో రైతులు, హమాలీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో శాశ్వత మార్కెట్ యార్డు పనులు చేపట్టే అవకాశం లేదు. ప్రైవేట్ స్థలంలో సరైన భద్రత, కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం షెడ్లు కూడా లేకపోడంతో అగ్నిప్రమాదాలు సంభవించినా, అధిక వర్షాలు కురిసినా రైతులు మార్కెట్‌కు తెచ్చిన పత్తిని రక్షించుకోలేని పరిస్థితి. ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా పత్తి తడిసిపోతుండటంతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు, యార్డులో పని చేసే హమాలీలకు తాగునీరు, సేద తీరేందుకు నీడ వంటి కనీస వసతి లేకపోవడంతో మండుటెండలోనే మగ్గాల్సిన దయనీయ పరిస్థితి. భోజనాలు చేసేందుకు కూడా అవస్థలు పడుతున్నారు. జిల్లాల పునర్విభజన తరువాత జూలూరుపాడు మండలం కొత్తగూడెం జిల్లాలోకి వచ్చింది. కానీ పత్తి మార్కెట్ మాత్రం ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోనే కొనసాగుతుండటం విశేషం. దీపావళి నాటికి మార్కెట్‌కు పత్తి విరివిగా వచ్చే అవకాశాలు ఉన్నట్లు వ్యాపారులు చెపుతున్నారు. ఇప్పటికైనా శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణ పనులపై అధికారులు, పాలకులు దృష్టి సారించాలని రైతులు, హమాలీలు కోరుతున్నారు.

మార్కెట్ నిర్మించాలి...



తాత్కాలిక మార్కెట్ యార్డులో పత్తి అమ్ముకునేందుకు వస్తే కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం. శాశ్వత యార్డు నిర్మించాలి. ఈనెల చివరి నుంచి పత్తితీతలు ప్రారంభం అవుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– భూక్యా రమేష్, రైతు, గుండ్లరేవు

వర్షం వస్తే ఇక్కట్లు..



ఏ కొద్దిపాటి వర్షం వచ్చినా మార్కెట్‌కు తెచ్చిన పత్తి తడిసి పోవాల్సిందే. మార్కెట్‌లో షెడ్లు, ఎలాంటి వసతులు లేవు. తాగడానికి నీళ్లు, ఎండ నుంచి విశ్రాంతి తీసుకోవడానికి నీడ లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించాలి.

– ధరావత్ రాంచందర్, రైతు భేతాళపాడు

శాశ్వత మార్కెట్ నిర్మించాలి..



ప్రభుత్వం స్థలంలో శాశ్వత మార్కెట్ యార్డు నిర్మించాలి. ఎన్నో ఏళ్లుగా కార్యరూపం దాల్చడం లేదు. జిల్లాలు విభజన జరిగినప్పటికీ ఏన్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జూలూరుపాడు మార్కెట్ కొనసాగడం సరైంది కాదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మార్కెట్ అభివృద్ధి కావడం లేదు.

– వేల్పుల నరసింహారావు, జూలూరుపాడు

ప్రతిపాదనలు పంపించాం..

జూలూరుపాడు మార్కెట్ యార్డు కోసం ప్రతిపాదనలు పంపించాం. శాశ్వత మార్కెట్ యార్డుకు 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. అనుమతి రాగానే శాశ్వత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం తాత్కలిక మార్కెట్‌గానే కొనసాగుతోంది. సాధ్యమైనంత వరకు మార్కెట్ యార్డ్‌లో రైతులకు, హమాలీలకు సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– అబ్దుల్ అలీమ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

పంట ఉత్పత్తుల ధరలు పెంచండి..



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

సింగరేణి(కొత్తగూడెం): స్వామినాథన్ కమిటీ సిఫారసు మేరకు పంటలకు ధరలు నిర్ణయించి కొనుగోలు చేయాలని, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తగూడెం పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇచ్చే విధంగా ధరలు నిర్ణయించాలన్నారు. పత్తి, మొక్కజొన్న, పంటలను దళారులు అతి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని దీన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పత్తి పంటకు క్వింటాల్ ఒక్కింటికి రూ.7,230 ప్రకటించగా, వ్యాపారులు రూ.5 వేలలోపే రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. మార్కెట్ల ద్వారా రైతుల అన్నిరకాల పంటలను స్వామినాథన్ కమిటీ సిఫారసును అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు గుమ్మడి నర్సయ్య, ముద్దా భిక్షం, బుర్రా వెంకన్న, కల్లూరి కిశోర్, బానోత్ ధర్మ, నాగేశ్వరరావు, కంగాల కన్నయ్య, భుక్యా పంతులు, శ్రీరాం, కోటయ్య, లింగాల వీరభద్రం, అప్పారావు, కల్లయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు

జూలూరుపాడు: ప్రజా సమస్యలు, భూమి కోసం, భుక్తి కోసం తాటి లక్ష్మి అలుపెరగని పోరాటాలు చేశారని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య అన్నారు. బుధవారం గుండ్లరేవు గ్రామంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆ పార్టీ నాయకురాలు తాటి లక్ష్మి సంతాప సభలో ఆయన మాట్లాడారు. జాటోత్ కృష్ణ, బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, రాయల సిద్ధు, కృష్ణయ్య, తాటి రోహిణి, రాజేశ్వరరావు, తెల్లం నరసింహారావు, తెల్లం కృష్ణయ్య, ముక్తి జగదీష్, మల్కం సతీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరుకు రైతులతో సమావేశం



రైతులతో సమావేశమైన ఫ్యాక్టరీ ప్రతినిధులు

జూలూరుపాడు: కల్లూరు కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడులో చెరుకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీ ప్రతినిధి రఘునాథబాబు మాట్లాడుతూ.. చెరుకు టన్నుకు మద్దతు ధర రూ.3,200 ఇస్తున్నట్లు చెప్పారు. రైతులకు ఒక ఎకరానికి రెండు టన్నుల విత్తనం ఉచితంగా ఇస్తున్నామని, చెరుకు పంట నరకటానికి కూలీల కొరత కారణంగా ఫ్యాక్టరీ యాజమాన్యం యంత్రాలతో కట్ చేసి ఫ్యాక్టరీకి తరలించడం జరుగుతుందన్నారు. ఎకరానికి 50–60 టన్నుల పంట దిగుబడి వస్తుందని, ఎకరానికి రూ.లక్ష ఆదాయం వస్తుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు చెరుకు పంట విస్తీర్ణాన్ని పెంచి, ఆదాయం పొందవచ్చని సూచించారు. అంతకుముందు ఫ్యాక్టరీ ప్రతినిధుల బృందం రైతులతో కలిసి చెరుకు పంటను పరిశీలించారు. కార్యక్రమంలో కేన్ మేనేజర్ శాఖమూరి హరిబాబు, ఏఓ ప్రభాకర్‌రావు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు హరిబాబు, ఎం.రాజేష్, రైతులు చిలుకూరి రమేష్, సిరిపురపు వెంకటేశ్వర్లు, యల్లంకి నరసింహారావు, నున్నా రంగారావు, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, తాళ్లూరి రామారావు, యల్లంకి వెంకటేశ్వర్లు, మిర్యాల రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కొమరయ్య

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వాలు ఎన్ని కఠిన చట్టాలను అమలు చేస్తున్నా ఎక్కడో ఒకచోట ఆడపిల్ల మీద అఘాయిత్యాలు జరుగుతున్నాయని, విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని షీ టీం సబ్ ఇన్‌స్పెక్టర్ కొమరయ్య అన్నారు. బుధవారం కొత్తగూడెం మున్సిపల్ 12వ వార్డు సుభాష్ చంద్రబోస్ నగర్‌లోని మోడ్రన్ ఇఖ్రా స్కూల్‌లో షీ టీం, భరోసా టీం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆడపిల్లలు అపరిచితులతో మాట్లాడవద్దని, ముఖ్యంగా ఫోన్‌లలో చాటింగ్, ఫేస్‌బుక్‌లో ఫొటోలు పెట్టరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు డైల్ చేసి సహాయం పొందాలన్నారు. అనంతరం భరోసా కౌన్సిలర్ రేణుకా మాట్లాడుతూ... ఆడపిల్లలకు, మహిళలకు ఏదైనా జరిగితే న్యాయ సహాయం, సలహాల కోసం భరోసా సెంటర్‌ను ప్రభుత్వం నెలకొల్పిందని, దానిని ఉపయోగించుకొని న్యాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగయ్య, స్కూల్ కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్, ప్రధాన అధ్యాపకురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు నీలా, నసరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



హోమం నిర్వహిస్తున్న భక్తులు

జూలూరుపాడు: మండల కేంద్రంలోని శ్రీసీతారామాలయంలో బుధవారం శ్రీ గణేష్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దాతలు పెంటికల వెంకటేశ్వర్లు, మంగతాయి దంపతులు, పెంటికల వీరబాబు, సుభద్ర దంపతులు, పెంటికల మహేష్‌ల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

జూలూరుపాడు: వెంగన్నపాలెం గ్రామం శ్రీదత్తనగర్‌లోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయ 22వ వార్షికోత్సవం గురువారం జరగనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబాను దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

బంజారా సంఘం మండలాధ్యక్షుడిగా శ్రీను



నియామకపత్రం అందజేస్తున్న ప్రసాద్‌నాయక్

కొత్తగూడెంరూరల్: సేవాలాల్ బంజారా సంఘం లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడిగా గుగులోతు శ్రీను నాయక్‌ను బుధవారం నియమించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లావుడ్యా ప్రసాద్ నాయక్ నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో గుగులోతు శంకర్‌నాయక్, భట్టు హుస్సేన్ నాయక్, రాంబాబు, గణేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

ఇల్లెందు: వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఇల్లెందు ఏరియా ఆధ్వర్యంలో సింగరేణి గ్రౌండ్‌లో జరిగిన క్రీడా పోటీల ముగింపులో ఏరియా జీఎం జాన్‌ఆనంద్ పాల్గొన్నారు. బుధవారం కంపెనీ స్థాయి బాస్కెట్ బాల్, లాన్ టెన్నిస్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌ఓటూజీఎం బి.వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షులు జే.వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాస్, సాయి స్వరూప్, రమేష్‌సింగ్, అన్వర్ పాల్గొన్నారు.

సంక్షోభంలో విద్యారంగం

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యల వలన అట్టడుగు కులాల, వర్గాల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటూ విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెడుతోందని, ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మూస ధోరణిని అవలంబిస్తోందని ఆరోపించారు. విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించి 7.3 శాతం మాత్రమే కేటాయించిందని పేర్కొన్నారు. అదేవిధంగా 2014 బడ్జెట్‌లో విద్యారంగానికి కేంద్రంలోని మోదీ సర్కార్ 6 శాతం నిధులు కేటాయించగా.. 2024 నాటికి అవి 2.5 శాతానికి తగ్గించారని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 30 వేలకు పైగా పాఠశాలల్లో వసతులు కల్పించి, వాటిని అభివృద్ధి చేయకుండా నియోజకవర్గానికో ఇంటర్నేషనల్ స్కూల్ స్థాపిస్తామని, మండలానికో సమీకృత పాఠశాలను ఏర్పాటు చేస్తామంటూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యారంగంలో వచ్చిన, వస్తున్న మార్పులు ప్రభుత్వ విద్యను బలహీన పర్చేలా ఉన్నాయని, పేదలకు, మధ్యతరగతికే కాకుండా ఎగువ మధ్యతరగతి వారికి కూడా విద్యను దూరం చేసే విధంగా ఉన్నాయని, వీటి వల్ల అభ్యాసన సంక్షోభం ఇంకా తీవ్రమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక సింగరేణి



సింగరేణి(కొత్తగూడెం): ఆలయంలో ఏరియా జీఎం శాలేంరాజు, తదితరులు



ఇల్లెందు: పూజలు చేస్తున్న జీఎం జాన్‌ఆనంద్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ మతసామరస్యానికి ప్రతీకని, సంస్థలో భిన్న మతస్తులు కలిసిమెలసి ఉండటం హర్షణీయమని, సంస్థ పెద్దలు కూడా మతాలకు అనుగుణంగా సెలవులు, వేడుకల నిర్వహణకై వారికి వారి పండుగల కోసం ప్రత్యేక అడ్వాన్స్ చెల్లించటం గొప్ప విషయమని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు అన్నారు. ఏరియాలోని జీఎం కార్యాలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి కార్మికులకు మహాఅన్నదానం నిర్వహించారు.

జీఎం మాట్లాడుతూ... ఈ వేడుకలు సింగరేణి వ్యాప్తంగా నిర్వహించినప్పటికీ ఏరియాలోని కార్మికులకు అన్నదానం చేయటం తనకు ఆనందంగా ఉందన్నారు. కార్మికుల సమస్యలతోపాటు వారి ఆనందంలో పాలు పంచుకోవటం తన బాధ్యతని అందుకే, తాను ఏ ఏరియాలో ఉన్నా ఆయా ఏరియాల కార్మిక కుటుంబాల సంతోషం కోరుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మల్లికార్జున్‌రావు, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, జీఎం ఈఅండ్ఎం రఘురామిరెడ్డి, జీఎం ఐటీ రామ్‌కుమార్, జీఎం సీహెచ్‌పీఎస్ ఎం.తిరుమలరావు, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, అధికారుల సంఘం నాయకులు నరసింహారావు, ఏజీఎం రామకృష్ణ, డీజీఎం శివకేశవరావు, సుమలత, యోహాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జేకే ఓసీలో చండీయాగం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో బుధవారం చండీయాగం నిర్వహించారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం జరిగే యాగం పూజలను ఏరియా జీఎం జాన్‌ఆనంద్, పీఓ కృష్ణమోహన్ ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ వరకు చండీయాగం, ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, అధికారులు జీవీ మోహన్‌రావు, రామస్వామి, పూర్ణచందర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి స్పందించండి..



ఎమ్మెల్యే కనకయ్య, చైర్మన్ డీవీతో చర్చిస్తున్న నాయకులు

ఇల్లెందు: పట్టణంలోని 24 వార్డుల్లో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. బుధవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. అక్కడే ఉన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావులకు నాయకులు వినతిపత్రం అందజేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ మాట్లాడుతూ.. కోతులు, వీధి కుక్కలు, పందులు, దోమల బెడద తీవ్రంగా ఉందని తెలిపారు. స్టేషన్ బస్తీలో జీఓ 76 అమలు చేయాలని కోరారు. రాజీవ్ నగర్ గుడిశ వాసులకు ఇంటి నంబర్లు ఇవ్వాలని తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. దేవులపల్లి యాకయ్య, సున్నం రాజయ్యనగర్ గుడిశ వాసులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నబీ, కృష్ణ, కిరణ్, మోహన్‌రావు, లక్ష్మి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీఓ చిరంజీవికి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ మాట్లాడుతూ.. గ్రామాలలో వీధి కుక్కలు, కోతుల బెడదతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని వాపోయారు. సీఎస్పీ బస్తీ గ్రామ పంచాయతీ రాజీవ్‌నగర్ తండా సమీపంలోని గుడిసెవాసులకు కనీస సౌకర్యాలు కల్పించాలని పలుమార్లు ఆందోళన చేసి వినతిపత్రాలు అందజేశామని, పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం మినహా ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. తిలక్‌నగర్ గ్రామపంచాయతీ జెడ్పీ మోడల్‌కాలనీలో తాగునీటి సౌకర్యం కోసం ఆందోళన చేసినా అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. ఆయా సమస్యలపై తక్షణం స్పందించి పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్, మన్యం మోహన్‌రావు, తాళ్లూరి కృష్ణ, ఆలేటి సంధ్య, పద్మ పాల్గొన్నారు.

నిబంధనలు లేకుండా బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న సురేందర్‌రావు

టేకులపల్లి: సింగరేణి ప్రకటించిన లాభాల బోనస్ కోయగూడెం ఓపెన్‌కాస్టులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ వర్తింపజేయాలని టేకులపల్లి కార్మిక, రాజకీయ జేఏసీ కన్వీనర్ లక్కినేని సురేందర్‌రావు, వివిధ యూనియన్లు, పార్టీల నాయకులు దుబాకుల ప్రసాద్, భూక్యా దళ్‌సింగ్‌నాయక్, ధర్మపురి వీరబ్రహ్మాచారి, భూక్యా హర్ష్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేఓసీలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేఓసీ ఎల్‌ఎస్‌ఎన్ క్యాంపు కార్యాలయం వద్ద జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. సింగరేణి చరిత్రలో కష్టపడుతున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఎన్నో ఉద్యమాల తర్వాత లాభాల బోనస్ సాధించుకుంటే టేకులపల్లి మండలం కోయగూడెం ఓసీలో ఎల్‌ఎస్‌ఎన్ కంపెనీ వారు సుమారు 350 మంది కార్మికులకు గాను 160 మందికి మాత్రమే బోనస్ ఇవ్వడంతో ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రెండేళ్లుగా రెగ్యులర్ మస్టర్లు ఉన్న కార్మికులకు కూడా బోనస్ ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఎల్‌ఎస్‌ఎన్ కంపెనీ దిగివచ్చి కార్మికులకు బోనస్ ఇవ్వాలని లేదంటే కంపెనీపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. గౌని నాగేశ్వరరావు, యాకూబ్ షావలి, రామ్‌సింగ్ సంఘీభావం తెలిపారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన





కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్, జూలూరుపాడు: మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కొత్తగూడెంఅర్బన్: గంజాయి అమ్మకాలు, రవాణా, కొనుగోలుకు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని త్రీటౌన్ సీఐ శివప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మేదరబస్తీలోని ఐటీఐ కళాశాలలో డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. యువత మత్తుకు బానిసలు కాకుండా, వారిని నమ్ముకున్న కుటుంబసభ్యులు రోడ్డున పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గంజాయికి సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలు, కొత్త నేర చట్టాలపై జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక సాధన జూనియర్ కళాశాలలో మాట్లాడుతూ.. డ్రగ్స్‌ను అక్రమంగా తరలించడం, వినియోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి సమాచారం తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.